జ్యోతిష్ఠం

# అంతా ఆయనదే!!



– డిఎస్సార్

పరమాత్మతత్త్వం మొదలుకొని ఈ విశ్వం నిస్వార్థంగా పనిచేస్తున్నది, ప్రకృతి కూడా స్వార్థరహితంగా నడుస్తున్నది. మానవమాత్రులం మనం తప్పుడు జీవన విధానం, స్వార్థం కారణంగా అనేక కష్ఠాలు, సమస్యలు, దుఃఖాలకారణంగా కష్టనష్టాలకు గురౌతున్నాము.

ప్రకృతి నుంచి మనం నిస్వార్థంగా యివ్వటం నేర్చుకోవాలి. చెట్లను చూడండి, ప్రకృతి నుంచి గాలి, నీరు, వెలుతురును తీసుకొని, ఆహారం, నీడ, జీవశక్తి యిస్తున్నాయి. ప్రకృతి నుంచి ఏదైతే తీసుకుంటాయో, ఇంకో విధంగా తిరిగి యిచ్చేస్తున్నాయి.

మనం మానవులు మాత్రం, ప్రకృతి నుంచి ప్రపంచం నుంచి తల్లిదండ్రుల నుంచి కుటుంబం స్నేహితుల నుంచి అనేక విధములుగా సహాయసహకారాలు పొందుతున్నాం. అయినా వారు యిచ్చారనే గమనం కూడా లేకుండా మర్చిపోతున్నాము. పోనీ యింకో విధంగా యిచ్చిపుచ్చుకోవటం కూడా జరగదు.

మనం జీవితంలో ఉపాధ్యాయులనుండి ఉపయోగకరమైన అనేక విషయాలు నేర్చుకుంటున్నాము. వారు నేర్పిన వాటిలో కొంత భాగమయినా ఇతరులతో పంచుకునే సంగతిని మర్చిపోతున్నాము.

మన జీవితకాలంలో ఎందరు మనలను ప్రోత్సహించారో, సహాయంచేసారో, అయినా మనలో ఎంతమందిమి యితరులకు సహాయ సహకారాలు చేసాము ? మనకు మనం ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకోవాలి ?

మనకు సహాయ సహకారాలు అందించిన వారికి అదే సహకారం అందించడం కుదరకపోతే, అవసరంలోవున్నవారికి సహాయం చేయగల్గాలి.

లెక్కకు మించిన ప్రజలు మన జీవితకాలంలో ప్రోత్సహించారు, మార్గదర్శకులయ్యారు. అయినా మన జీవనయానంలో ఎంత మందికి అలాంటి సహాయసహకారాలు అందించగలము ? మనకు మనం ఈ ప్రశ్నలు వేసుకోవాలి. ఈ విషయాలను దాచకూడదు.

సమాజం నుంచి, కమ్యూనిటి నుంచి, దేశం నుంచి ఆ సహాయాన్ని, ఏమి ఆలోచించకుండా యిచ్చివేయాలి అది మన కర్తవ్యం, మనవిధి. ఉదాహరణకు మన తల్లిదండ్రులు ప్రేమతో ఏ కండీషనులు లేకుండా పెంచుతారు. అదే ప్రేమను వారికి పంచాలి. వారిని కడుజాగరూకతతో చూసుకోవాలి.

భగవద్గీతలో కృష్ణుడు అర్జునునికి సలహాయిస్తాడు. "మన పైవారికి నిస్వార్థంగా సహాయం చేయాలి" ఒక ఉపాధ్యాయుడు ఉన్నత స్థానంలో వున్నాడనుకోండి. విద్యార్థులు అతనికి గౌరవమిచ్చి, నిస్వార్థంగా సేవచేయాలి. ఎవరి కర్తవ్యాన్నివారు చేస్తే యిద్దరూ ఉన్నత స్థానాలకు ఎదుగుతారు. అదే విధంగా తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల తమ విధులను ఎలా తీర్చుకుంటారో, అలాగే పిల్లలు కూడా తమ విధులను నెరవేరుస్తే ఇద్దరూ ఉన్నత స్థానాలలో నిలుస్తారు.

ఇందుకు భిన్నంగా శ్రీకృష్ణుడు కఠినమయిన, విశదీకరించే స్వరం వాడాడు, ఒక వ్యక్తి ఎంత సేపూ ఎదుటివాళ్ళ నుంచి తీసుకోవడమేగాని, తిరిగి ఇవ్వలేని వాళ్ళను 'దొంగ' అని అంటారు. ఇంకా అంటాడు... ఎంతసేపూ తన పని గురించే ఆలోచించేవాడిని "పాపాలపుట్ట"గా అభివర్ణించాడు. వారికి శాంతి సౌఖ్యాలు వుండవు. వారు ఎప్పుడూ పాపాల లంకలో మునిగితేలుతారు.

పురాణాలు, భారత, భాగవతాది గ్రంథాలు పఠిస్తున్నప్పుడు, 'భగవంతుడు' అని ఎవరిని అంటున్నామో, 'సుప్రీమ్ పవర్', మాస్టర్ ఆఫ్ యూనివర్స్, ఈ ప్రపంచంలోని యావదాస్తి ఆయనకు చెందుతుంది. ఆయనకు కావాల్సినది ఏదీలేదు. మనకొచ్చేది అంతా ఆయనదే ? ఆయనదే ఆయనకు యిస్తున్నాము. మనం సంపాదించే దాంట్లో ప్రప్రథముగా ఆయనకు సమర్పించాలి, మిగతాది మనం వాడుకోవాలి. దీనినే 'సృష్టి చక్రం' అంటాము. మనం చేసే ప్రతిక్రియలోను ఆయనకు భాగముంచు ఆవిధంగా ఎల్లరి యోగక్షేమాల కోసం, మన శక్తిమేర, నిస్వార్థంగా కృషిచేయాలి. ఆ పనితో మనకు ఏ మాత్రం సంబంధం వుండకూడదు. ఫలితం ఆశించకుండా కర్తవ్యం చేయాలి. ఎవరికి వారు తమ కర్తవ్యాన్ని చేయగల్గాలి. అందరి శ్రేయస్సు కాంక్షిస్తూ క్రియలను చేయగల్గాలి. మన అంతిమ లక్ష్యం "సర్వేజనాః సుఖినోభవంతు" కాగల్గాలి.

**కార్యదర్శి**

**దివ్యజ్ఞాన దీపిక ట్రస్టు**

**ఆర్. అగ్రహారం, గుంటూరు.**

మేడమ్!

నేను ఇప్పటివరకు (జూన్ 2014 నుండి సెప్టెంబరు 2020 వరకు) దివ్యజ్ఞానదీపికకు సంపాదకునిగా బాధ్యతలు నిర్వహించాను. గత సర్వసభ్య సమావేశంలో వెల్లడించిన విధంగా నేను నా బాధ్యతలనుండి విరమిస్తున్నాను. దయచేసి నా బాధ్యతల నుంచి నన్ను విడుదల చేయవల్సిందిగా కోరుతున్నాను.

ఇన్నాళ్ళు 'దీపిక' సంపాదకత్వంలో పాలుపంచుకున్న వారందరికీ పేరుపేరున ధన్యవాదములు తెలుపుకుంటున్నాను. పాఠక మహాశయులందరికీ అభినందనలు.

**ఇట్లు- మీ విధేయుడు**

**(డి.యస్.ఆర్. ఆంజనేయులు)**

---

# ధన్యవాదములు



దివ్యజ్ఞాన దీపికకు 2014 నుండి 2020 వరకు గౌరవ సంపాదకులుగా ఎంతో సమర్థవంతంగా దీపికను నిర్వహించారు శ్రీ డి.ఎస్.ఆర్. ఆంజనేయులు గారు. వారు ఆల్ ఇండియా రేడియోలో చాలా కాలం పనిచేసారు. వారు సౌమ్యులు, మితభాషి, విజయవాడ దివ్యజ్ఞాన సమాజానికి కొంత కాలంగా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

దీపికను జూన్ 2014లో వారికి (సంపాదకులుగా) గుంటూరు శ్రీకృష్ణ దివ్యజ్ఞాన సమాజ పూర్వాధ్యక్షులు శ్రీ జి.వి.ఎల్.ఎన్.సంజీవరావు (కార్యదర్శిగా) బాధ్యతలు అప్పజెప్పినప్పటి నుండి దీపికను ఎంతో చక్కగా తీర్చిదిద్దారు. పుస్తక కవరు పేజీని డబల్ కలర్స్‌లో 4 పేజీలు మంచి నాణ్యమైన కాగితంపై ప్రింట్ చేసి మరింత ఆకర్షణీయంగా తయారు చేసారు.

పత్రిక పాఠకులను 350 నుండి సుమారు 750 దాకా పెరిగేలా ఎంతో కృషి చేసారు. ప్రతీ నెలా జోతిష్పథంలో (సంపాదకీయం) ఎన్నో విషయాలు తీసుకుని వాటిని చక్కగా వివరించారు. 1910 నుండి 1995 వరకు దీపికలో ప్రచురితమైన మంచి మంచి వ్యాసాలు, కథలు వగైరాలను కూర్చి "దివ్యజ్ఞాన దీపికా వ్యాస కదంబం" అను పుస్తకం ప్రచురించారు. ఆరు సంవత్సరాలు దీపిక సంపాదకునిగా వ్యవహరించి దానిని ఎంతో వృద్ధిలోకి తీసుకువచ్చిన శ్రీ ఆంజనేయులుగారు ప్రశంసా పాత్రులు.

శ్రీ ఆంజనేయులుగారికి దీపిక పాఠకులు, రచయితలు, తెలుగు మరియు రాయలసీమ సమాఖ్యలు మరియు దీపిక ట్రస్టు తరఫున ధన్యవాదములు.

## దివ్యజ్ఞానదీపిక కార్యవర్గ సమావేశము.

ది. 12.9.2020వ తేదీన దీపిక కార్యవర్గ సమావేశము ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమాన్ని ఉ॥ 11.00 గం॥లకు అంతర్జాలము ద్వారా నిర్వహించడం జరిగింది. సమావేశం ముఖ్య అజెండా దీపిక నూతన సంపాదకుని ఎన్నుకొని నియమించుట. ఇప్పటి వరకు దీపికకు 6 సంవత్సరాలుగా సంపాదకునిగా సేవచేస్తున్న శ్రీ డి.ఎస్.ఆర్. ఆంజనేయులుగారు స్వీయ కారణాల దృష్ట్యా రాజీనామా చేసినారు. ఆయన రాజీనామాను ఆమోదించి వారి స్థానంలో నూతనంగా విశాఖపట్నం దివ్యజ్ఞాన సమాజ సభ్యుడైన డా॥ ఈ.వి.కె.శివానంద్ గారిని నూతన సంపాదకులుగా నియమించుకోవడం జరిగింది. ఈ సమావేశంలో దీపిక అభివృద్ధికొరకు చేపట్టవలసిన మార్పుల గురించి విపులంగా చర్చించారు. దీపిక వ్యాసాలను మరింత నాణ్యతగా ప్రచురించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చర్చించారు.

ఈ కార్యక్రమంలో చివరగా ఇంతవరకు గౌరవ సంపాదకులుగా బాధ్యతలు నిర్వహించిన శ్రీ డి.యస్.ఆర్.ఆంజనేయులుగారికి ధన్యవాదాలు తెలియజేస్తూ సమావేశం ముగించారు.

# సంత్ ధనీ ధర్మదాసు

– **శ్రీ పరికిపండ్ల సారంగపాణి,** హన్మకొండ
సెల్ : 9849630290

ఐశ్వర్యవంతుడు అని పేరు ముందు పెట్టుకోగలిగిన సంత్ ధర్మదాసు గొప్ప వైష్ణవభక్తుడు. స్వయంగా కబీరుదాసు మెచ్చుకున్న ఆదర్శ శిష్యునిగా ఛత్తీస్ గఢ్ మొదటికవిగా ప్రసిద్ధి చెందిన మహా పురుషుడు ధర్మదాసు. ఆ కాలంలో కబీరు దాసుకు ఎంతటి పేరు ప్రతిష్ఠలు ఉండేవో ఆయన తరువాత అంతటి పేరొందిన వ్యక్తి ధర్మదాసే అంటారు చరిత్రకారులు. గురువే తన సర్వస్వంగా చెబుతూ

**గురు బిన్ కౌన్ హరే మేరా పీరా – –**

గురువు తప్ప నా దుఃఖాన్ని ఎవరు దూరం చేయగలరరూ! అంటాడు ధర్మదాసు.

**జీవిత విశేషాలు :**

ధర్మదాసు సుమారు 1416 లో ఛత్తీస్ గఢ్ లో బాంధ్ బగఢ్ లోని కసౌంధ ధన్‌లో జన్మించినట్టు చెబుతారు. ఆయన తల్లిదండ్రులు సుధర్మవతి, మన్ మహేశ్. వీరు వైశ్యులు.

"హమ్ సత్తా నామ్ కాబైపారి" అంటాడు ధర్మదాసు తన కులంగురించి చెబుతూ, చిన్నప్పటినుండి ఆయనకు ధర్మభక్తి ఎక్కువ. అందుకే తల్లిదండ్రులతో గురువుల ప్రవచనాలు వినడానికి వెళ్తుండేవాడు. కుటుంబంతో కలసి తీర్థయాత్రలు చేసేవాడు. సత్సంగాల్లో కూర్చుని సాధువుల దైవసంబంధమైన చర్చలు వింటుండేవాడు. యుక్త వయస్సులో ధర్మదాసు వివాహం పథర్ హాట్ నగరవాసియైన సులక్షణావతి అనే కన్యతో జరుగుతుంది.

ఒకనాడు ధర్మదాసు సకుటుంబంగా మధుర వెళ్ళి వచ్చేటప్పుడు మహాత్మ కబీరును దర్శించుకొని బాంధ్ బగఢ్ రావల్సిందిగా ఆహ్వానిస్తాడు. ఆయన ఆహ్వానం మేరకు వెళ్ళిన కబీరుముందు మోకరిల్లి వినయంతో ధర్మదాసు దంపతులు, తమకు దీక్షనీయవల్సిందిగా వేడుకుంటారు. కబీరు ఆ దంపతులకు దీక్షనిచ్చి ధర్మదాసును తన తరువాత కబీరు సంప్రదాయాన్ని నడిపించే మఠాధిపతిగా వ్యవహరించమంటాడు. దీక్ష తీసుకున్న ధర్మదాసు భార్య పేరు ఆమిన్‌మాతగా మార్చి కబీరు సాంప్రదాయ యోగినుల సంక్షేమ బాధ్యతలు తీసుకోవల్సిందిగా చెబుతాడు. అప్పటినుండి ధర్మదాసు దంపతులు నిర్గుణ భక్తితత్వాన్ని బోధిస్తూ విగ్రహారాధన, తీర్థయాత్రలకు

దూరం ఉండవల్సిందిగా ప్రజలను ప్రేరేపించేవారు. ఆత్మలోనే పరమాత్మణ్ణి చూస్తూ నైతికంగా జీవించాలనేవారు.

"సంసార సుడిగుండంలో చిక్కుకున్న ఈ దాసుడ్ని దరిజేర్చేవాడవు నీవే ప్రభూ!

తల్లిదండ్రులు, కన్నపిల్లలు, బంధువులందరూ ఇక్కడి వరకే అనేది తెలియకుండా ఎన్నో బాధలు అనుభవిస్తుంటారు. అలాంటి బాధల్నుండి ప్రజల్ని నీవే దరిచేర్చాలి!

ధర్మదాసు జననమరణ రహస్యాలు తెలిపి ఈ నావికుణ్ణి ఒడ్డున చేర్చు ప్రభూ! అంటూ వేడుకుంటాడు.

ధనీ ధర్మదాసు కవితల్లో ఆర్తి భావాలే ఎక్కువ అంటారు సాహిత్య విమర్శకులు.

సాహెబ్ చితవో హమరీ ఓర్
హమ్ చితవైం తుమ్ చితవో నహీం
తుమ్హారో హృదయ్ కఠోర్,
ఔరన్ కోతో ఔర్ భరోసో
హమైం భరోసో తోర్
సుఖమన్ సేజ్ బిఛావో గగన్‌మే
నిత్ ఉఠికరౌం నిహోర్
ధరమ్ దాస్ బినవైం కర్‌జోరీ
సాహెబ్ కబీర్ బందీఛోర్

"ఓ సద్గురూ, నీ దయార్ధ్ర దృష్టిని నావైపు మరల్చు! నేనెంతో వ్యాకులతతో నీవైపు చూస్తున్నాను. నీవు నావైపు దృష్టి మరల్చకపోతే నిన్ను "కఠినాత్ముడు" అంటారు. ఎందరెందరు ఎవరెవరినో నమ్ముతారు. కానీ, నేను మాత్రం నిన్నే నమ్ముతున్నాను. నిన్ను అంతరంగంలో ఉంచుకొని నిత్యం ధ్యానిస్తున్నాను. ఈ ధర్మదాసు తన భక్తిని వ్యక్తపరచడానికి వినయంతో చేతులు జోడించి నమస్కరిస్తున్నాడు. కబీరు మహాత్మా, నాకు భవబంధాల నుండి ముక్తిని ప్రసాదించు అంటాడు.

**భక్తి కాలంలోని నిర్గుణ సంతుల బోధనలు:**

హిందీ సాహిత్యంలోని భక్తి యుగంలోని సంతులు సామాజికంగా వెనుకబడ్డ వర్గాలవారికే బోధనలు చేసేవారు. ఆ రోజుల్లో నిమ్నజాతులవారికి ఆలయ ప్రవేశం ఉండేది కాదు. అందుకే ఒకవర్గం సాధు సన్యాసులు వారికి నిర్గుణ భక్తితత్వాన్ని బోధిస్తూ వారిలో ఆధ్యాత్మిక బీజాలు నాటే ప్రయత్నం చేసేవారు. నైతిక ప్రవర్తనలతో కూడిన జీవన విధానాల గురించి అవగాహన కల్పించేవారు. మానవతా విలువల గురించి వివరించి చెప్పేవారు.

నిర్గుణతత్వ బోధకుల సాహిత్యమంతా దోహేల (రెండు పంక్తుల పద్యాల) రూపంలో పదాలుగా సాధారణ భాషలో

ఉండడం వల్ల సులభంగా ప్రజలు అర్థం చేసుకునేవారు.

నేటికీ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ లో కబీరుదాసు రవి దాసు, ధర్మదాసు వంటి సంతుల దోహేలు ప్రజలకు కంఠోపాఠం, ఆ దోహేలు, తెలుగు నాట చెప్పబడిన వేమన, సుమతి శతకాలవలె సుభాషితాలే!

ఈ సుభాషితాల్లో భక్తి, ఆత్మ, ప్రేమ, జ్ఞానం వంటివే గాక కులమతాలు, నైతిక ప్రవర్తనల విషయాల గురించి చెప్పబడ్డా యంటారు.

**"జాతి న పూఛియే సాధు కీ పూఛ్ లీజియే జ్ఞాన్"** అనే దోహేలో మనిషి కులాన్ని అడుగకు, ఆయనకున్న జ్ఞానాన్ని అడిగి తెలుసుకొమ్మంటాడు కబీరుదాసు.

**"మన్ చంగా తో కఠౌతీమే గంగా"** అనే పద్యంలో పవిత్రంగా ఉన్న మనస్సులో దేవుడు కొలువై ఉంటాడంటాడు సంత్ రవిదాసు.

**కబీరువాణి :**

కబీరు సంప్రదాయాన్ని స్వీకరించిన ధర్మదాసు దంపతులు తమ ఆస్తిపాస్తులను పేదలకు దానం చేసి చిరస్థాయిగా కబీరు మఠానికి వెళ్ళిపోయి కాశీలో కబీరుతోపాటు కాలం గడుపుతారు. ఆ సమయంలోనే కబీరు చెప్పిన వాటిని ధర్మదాసు గ్రంథస్థం చేస్తాడు. "కబీర్ అమృతవాణి", "కబీరు గ్రంథావళి" వంటి పేర్లతో అనేక గ్రంథాలు ఆవిర్భవించా యంటారు చరిత్ర కారులు.

'కబీర్ వాణి సంగ్రహ్' అనే పరిశోధనా గ్రంథంలో, సోనియా గోస్వామి, శ్రీకృష్ణుడు గీతోపదేశం చేస్తుండగా అర్జునుడు మననం చేసుకున్నట్లు, మహాత్మా కబీరు జ్ఞానబోధ చేస్తుండగా ధర్మదాసు ఆ బోధనజ్ఞానాన్ని కావ్యంగా తీర్చిదిద్దుతాడు అంటారు.

కబీరు వాణిలోని కొన్ని అంశాలు తీసుకొని ఆచార్య గ్రంథముని సాహెబ్ అనే ఆయన "ధని ధర్మదాస్ సాహెబ్ – ఆమిన్ మాతాశబ్దావళి" అనే పేరుతో ఓ కావ్యాన్ని సంకలనం చేసారు. ఈ సంకలన కావ్యం భక్తి మార్గంలో నడిచే వారికి దారి చూపే దీపం" అంటారు సాహిత్య పరిశోధకులు.

**ఛత్తీస్ గఢ్ మొట్టమొదటి కవి :**

ధనీ ధర్మదాసు సాహిత్య సృజన అనే అంశం మీద జాతీయ పురస్కారం పొందిన డా॥నిరుపమా శర్మ, "ఛత్తీస్‌గఢ్ సాహిత్యంలో ప్రథమకవిగా ధనీ ధర్మదాసు మరియు ఆమిన్ మాత ప్రథమ కవయిత్రిగా పేరొందడం ఛత్తీస్ గఢ్

ప్రజలకు ఎంతో గర్వకారణం. ఈ విధంగా దంపతులు ఒకే భాషలో ప్రప్రథములుగా పేరుగాంచడం ప్రపంచం లోని ఏ దేశ సాహిత్యం లోనూ జరిగి ఉండదు" అంటారు.

ధనీ ధర్మదాసు రాసిన కావ్యాలన్నీ ఆధ్యాత్మికతతో పాటు నైతికతకు సంబంధించినవే! ప్రతి పంక్తిలో ఆయన హృదయ స్పందనే వ్యక్తమవుతుంది. ఎక్కడా అలంకారాలు, ఆడంబరాలు జటిల ఛందస్సు ప్రయోగాలు, అర్థం కాని సమాసాల ప్రయోగాలు, కఠిన అర్థాలు కనిపించవంటారు సాహిత్య విమర్శకులు. ధర్మదాసు రాసినవన్నీ సులభశైలిలో అక్షరజ్ఞానమున్న ప్రతి ఒక్కరూ చదువుకొని అర్థం చేసుకోగలరంటారు.

**అర్జీ భఁవర్ బీచ్ నయి యాహో,**
**సాహెబ్ పార్ లగాదే!**
**మాతాపితు సుత్ తిరియా బంధు,**
**కోయీ నయియే సంగ్ జవ్ యీ యాహే**
**ధరమ్ దాస్ కే అరజ్ గోసాఁ యీ**
**ఆవాగమన్ కే మిటయియా హే**
**సాహెబ్ పార్ లగా దే**

**అగ్రవర్ణాల వ్యతిరేకత :**

ధనీ ధర్మదాసు అగ్రకులానికి చెందినవాడై ఉండి నిమ్నజాతి వారితో కలిసి తిరుగుతుండడం, వారికి ఆధ్యాత్మిక జ్ఞాన బోధ చేయడంవల్ల అగ్రవర్ణాలవారు అనేక సందర్భాల్లో ఆయన్ని అవమానా లకు గురిచేసే వారంటారు. అయినా ఆయన కబీరు సంప్రదాయాన్ని తుచ తప్పక పాటిస్తూ కులమతాలను వ్యతిరే కిస్తూండేవాడు. ఓ సందర్భంలో ధనీ ధర్మ దాసును తమ వీధిలో నడవకుండా వారు కట్టడి చేసారని చెప్పుకుంటారు. అయినా ధర్మదాసు అగ్రవర్ణాల ఆటంకాలను ఎదిరించి తన కార్యక్రమాలు నిర్విఘ్నంగా నిర్వహించేవాడు.

**ధనీ ధర్మదాసు మరణం:**

ధనీ ధర్మదాసు చివరి రోజుల్లో తను స్థాపించిన కబీరు సాంప్రదాయ మఠానికే వచ్చినాడని ఒక రోజు కబీరు చెబుతుండగా తాను రాసిన కబీరువాణి తన శిష్యులు సామూహికంగా పఠించే సమయంలో ధనీ ధర్మదాసుకు దివ్యప్రాప్తి కలిగిందని చెబుతారు.

తనకున్న ఐశ్వర్యంతో సకలభోగాల అనుభవించగలిగిన ధనీ ధర్మదాసు సన్యాసి జీవితం గడుపుతూ కేవలం ఛత్తీస్ గఢ్ ప్రాంతానికే పరిమితం గాక గొప్పదైన దైవశక్తిగా అవతరించి సంత్ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి పోయా రంటారు సాహిత్యకారులు.

**– 'సుపథ' సౌజన్యంతో**

# సిద్ధుల విలువ తెలియజేసే కథ

ఒక యువకుడు సిద్ధులు పొంద గోరి తల్లిదండ్రులను సోదరుని గృహాన్ని విడిచి వెళ్లి పోయాడు. సిద్ధయోగి కొరకు అడవిలో వెదకసాగాడు. చాలాకాలం తరువాత ఒక యోగిని కలుసుకొన్నాడు. భారత దేశంలో అనేక అరణ్యాలు వున్నాయి. సిద్ధులైనవారు సాధనలు కొనసాగించటానికి విఘ్నం కలగని ఏకాంత ప్రదేశాలైన అడవులను ఎన్ను కొంటారు. అందువల్ల ఆ యువకుడు ఒక యోగి వద్దకు పోయి శిష్యుడై గురువాజ్ఞ మేర తూచ తప్పకుండా సాధన చేస్తూ పదునాల్గు సంవత్సరాలు ఆయనతో గడిపాడు. ఒక దినం నదీ స్నానానికి పోయిన ఆ యువకుడు తను నీటిలో మునిగి పోకుండటం అనే సిద్ధి పొందినట్లు కనుగొన్నాడు. అతడు నీటిలో మునిగి పోవటం లేదు. నీటి మీద నడువగలుగుతున్నాడు. ఏదో ఒక సిద్ధిపొందిన శిష్యుని చూచి ఆనందించే గురువుకు ఆ విషయం చెప్పాడు. యువకుడు తన కోరిక నెర వేరిందని తలచాడు. ఇక దానిని అందరి ముందు ప్రదర్శించాలి. గురువు వద్ద శెలవు తీసుకొని ఇంటికి తిరిగి వచ్చాడు. తన సోదరునికి ఆశ్చర్యం కలిగించాలని ఇలా చెప్పాడు, “సోదరా! నాతో కూడా నదికి రా నేను సాధించింది నీకు ఎరుక చేస్తాను” అన్నాడు. ఇద్దరూ నదికి పోయారు. అక్కడ సిద్ధుడైన యువకుడు నీటి మీద నడుస్తూ నది ఆవలి ఒడ్డు చేరాడు. అదే సమయంలో అతడి సోదరుడు పావలా' ఇచ్చి పడవ బాడుగకు తీసుకొని సోదరునితో సమానంగా నది ఆవలి ఒడ్డు చేరాడు. ఇద్దరూ ఆవలిఒడ్డు చేరారు. “ఓ నా ప్రియమైన సోదరా! ఈ అద్భుత శక్తిని నీవు ఎలా సాధించావు?” అని అడిగాడు. యోగి ఇలా జవాబిచ్చాడు, “ఏల నంటవా! అత్యంత కఠిన నియమాలు పాటించాను. నిద్రాహారాలు మాని నాను. నీరు మాత్రం త్రాగి పన్నెండు సంవత్సరాలు సాధన చేసాను” అన్నాడు. సమయస్ఫూర్తి కలిగిన సోదరుడు, వెంటనే ఎంత విచారకరము! ఎంతో కాలాన్ని శక్తిని ఉపయోగించి ఒక్క పావలా విలువ గలిగిన దానిని

సాధించటమా! ఎంత మూఢుడవు సోదరా!" అన్నాడు.

ఐహిక వాంఛ కలిగినవారు సిద్ధులను స్తుతిస్తూ వుంటారు. ప్రపంచంలో అవి చాలా గొప్ప విషయాలు. లౌకికులు వాటిని కోరి వాటి వెంట పరుగిడుతుంటారు. కానీ ఆధ్యాత్మిక గురువులు వాటి గురించి లెక్కచేయరు. వారి మార్గంలో అవి ఆటంకాలని తలుస్తారు. కాని వాటివునికిని త్రోసి పుచ్చరు అంగీకరిస్తారు. కానీ వాటి కొరకు ప్రయత్నిస్తే భగవద్దర్శనం సమాధి స్థితి లాంటివి కలుగవని ఇంద్రియాల పరిధిలోనే వుండిపోతామని హెచ్చరిస్తారు. ఆ కారణంగానే యేసుక్రీస్తు, బుద్ధుడు, రామకృష్ణులు లాంటి సద్గురువులు వారి శిష్యులకు సిద్ధుల గురించి సిద్ధ ప్రక్రియల గురించి. బోధించవద్దని కట్టడి చేసారు. ప్రవృత్తి నధిగమించి నివృత్తి మార్గం అనుసరించమని బోధించారు.

పేరు ప్రఖ్యాతులు ఐహిక భోగాలు కోరి కొందరు సిద్ధుల కొరకు ఎగబడతారు. వాటిని స్వార్థ ప్రయోజనాలకు వాడు కొంటారు. కాని నిజమైన ముముక్షువు సత్యాన్వేషి వాటి కొరకు ప్రాకులాడడు. అవి బంధాలనీ ప్రతిబంధకాలని ఆత్మ భ్రమ కారకాలనీ వాటిని తృణీకరిస్తాడు. ఎవరు ప్రకృతి నధిగమించి పంచభూతాలు జయించి దివ్యత్వంలో అడుగిడాలని శ్రమిస్తారో వారు మాత్రమే నిజమైన ఆధ్యాత్మిక వేత్తలు.

**– 'శ్రీరామకృష్ణ ప్రభ' సౌజన్యంతో**

## జన్మదిన శుభాకాంక్షలు



తెలుగు దివ్యజ్ఞాన సమాఖ్య కార్యదర్శి

**శ్రీ జి.సుబ్రహ్మణ్యం** గారి మనుమడు

**జి.వి.సోమదత్త**

పుట్టినరోజు సెప్టెంబరు 3, 2020 తేదీన

జరుపుకొన్న సందర్భముగా

**సోమదత్తకు శుభాశీస్సులు.**

# ఓం నమో భగవతే వాసుదేవాయ

- **సేకరణ : బండారు భాగ్యలక్ష్మి,** నర్సాపురం

సెల్ : 9963893525

*(గత సంచిక తరువాయి)*

**శ్రీభగవానువాచ -**

**స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాం**
**శ్చక్షుశ్చై వాన్తరే భ్రువోః**
**ప్రాణా పానౌ సమౌ కృత్వా**
**నా సాభ్యన్తరచారిణౌ.**

(అ.5, శ్లో. 27)

**యతేన్ద్రియమనోబుద్ధిర్మ**
**నిర్మోక్షపరాయణః**
**విగతేచ్ఛాభయక్రోధో**
**యస్సదాముక్త ఏవ సః**

(అ.5, శ్లో. 28)

**తాత్పర్యము :** ఎవడు వెలుపల నున్న శబ్ద స్పర్శాది విషయములను వెలుపలికే నెట్టివైచి (లోనప్రవేశింప నీయక), చూపును భ్రూమధ్యమున నిలిపి, నాసికా పుటము లందు సంచరించు ప్రాణాపాన వాయువులను సమముగ జేసి, ఇంద్రియ మనోబుద్ధులను నిగ్రహించి ఇచ్ఛాభయ క్రోధములేని వాడై, మోక్షాసక్తుడై (ఆత్మ) మననశాలుడై యుండునో అట్టివాడు ఎల్లపుడును ముక్తుడే యగును.

**వ్యాఖ్య :** ''స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాన్" - శబ్దాది విషయముల యొక్క క్షేత్రము బహిఃప్రపంచము. జీవుని అంతర క్షేత్రమగు హృదయమున ప్రవేశించుటకు వానికేమి హక్కుగలదు? - అని విజ్ఞుడు యోచించి 'అవి యెచటనున్నవో అచటనే యుండుగాక' అని నిశ్చయించి, బాహ్య విషయములను లోనికి రానీయక, ఒకవేళ వచ్చినచో ప్రయత్న పూర్వకముగ బయటికి గెంటివేయును. అవివేకియే వానిని స్వేచ్ఛగ లోనికి రానిచ్చును. తత్ఫలితముగ విషయ లోలుడై సంసార గర్తమున పడిపోవు చున్నాడు. కాబట్టి వివేకి ఇంద్రియ ద్వారములకడ, మనోద్వారములకడ, 'ఫారా' ఏర్పాటు చేసి, "లోనికి పోగూడదు" - అని విషయములను ఆదేశించుచు దృశ్యరూప అన్య రాష్ట్ర మందుండు ఇంద్రి యార్థములను హృదయ సామ్రాజ్యము లోనికి రానీయక సదా జాగరూకుడై యుండును "చక్షుశ్చై వాన్తరేభ్రువోః" - ఈ ప్రకారముగ శబ్దాది విషయములను నిరోధించి, ధ్యాన నిష్టుడు దృష్టిని

భ్రూమధ్యమున నిలుపును దీనినే ఖేచరీముద్ర అందురు, ధ్యానము చేయువాడు కండ్లు తెరిచినచో చుట్టూ వున్న వస్తువులు కనబడుట వలన చిత్తమునకు విక్షేపము కలుగును. కండ్లు మూసికొనినచో నిద్రలో (తమస్సులో) పడిపోవు ప్రమాదము కలదు. కనుకనే యాతడు మధ్యేమార్గమును జేపట్టి నిమీలితనేత్రుడై భ్రూమధ్యమున దృష్టిని నిలిపి ధ్యానించుచుండును భ్రూమధ్య మనగా రెండు కనుబొమ్మల నడుమయని అర్థము. అచ్చోట ఆజ్ఞా చక్రముకలదు. నేత్రములకు అతిసమీపమున ఉండుట బట్టి భ్రూమధ్యస్థానమున దృష్టిని నిలిపి ధ్యానించుట సాధకునకు చాల అను కూలముగ నుండును. అయినను కొందఱు నాసికాగ్రమున, కొందఱు హృదయ స్థానమున, మఱికొందఱు సహస్రారమున గూడ దృష్టిని నిలిపి ధ్యానించు చుందురు. ఎవరికెట్లు అను కూలము అట్లు చేసికొనవచ్చును చిత్తము బహిర్ముఖముగ చెదరకుండుటయే ప్రధానము.

"ప్రాణాపానౌ సమౌకృత్వా" - సామాన్యముగ జనులందు ప్రాణాపాన వాయువులు సమముగ ప్రవహించ కుండును. ప్రాణాయామాభ్యాసముచే వానిని క్రమరీతిని బోవులాగున చేయుట ఆరోగ్యమునకు, చిత్తైకాగ్రతకు కూడ అవసరము కనుకనే ప్రాణాయామ మనునది అష్టాంగయోగము నందొ కానొక భాగముగ జేర్చబడినది. ప్రాణమునకు, మనస్సునకును అత్యంత సన్నిహిత సంబంధముకలదు. ఒక వేళ ఒకదానిని నిరోధించిన, మరియొకటి నిరుద్ధమగును. కావున అతిసూక్ష్మమగు మనస్సును నిగ్రహించుటయందు సహాయ కారిగ ఉండుటకై ప్రాణాయామమును శాస్త్రములందు విధించిరి ప్రాణా పానములను సమముగ ప్రవహింప జేయుటచే మనస్సున్ను చపలత్వము వీడి ఏకాగ్రతను బొందగలదు. "యతేంద్రియ మనోబుద్ధిః" - ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, వీనినన్నింటిని సాధకుడు తనయొక్క అదుపులో నుంచు కొనవలెను. అవి చెప్పినట్లు తానాడ రాదు. తాను చెప్పినట్లు అవి నడుచు కొనవలెను. ఇదియె ఇంద్రియ నిగ్రహము. అజ్ఞానివానికి దాసాను దాసుడై ప్రవర్తించును. జ్ఞాని వానిని నిగ్రహించి తనవశమందుంచుకొనును వాస్తవముగ తాను వానియన్నింటికి పైనున్న ఆత్మయేకాని, లోబడియున్న వస్తువుకాదు. ఈ సత్యమెరిగి అభ్యాస

వైరాగ్య విచారాణాదుల ద్వారా ఇంద్రి మనంబులను స్వాధీన పరచుకొనవలెను.

"మోక్షపరాయణః" – అజ్ఞానులు భోగపరాయణులైయుందురు. ముముక్షువులు మోక్షపరాయణులై వర్తించుదురు. కైవల్య ప్రాప్తికి తీవ్ర ముముక్షుత్వము అత్యవసరము మోక్షముకొరకై పరితపించు వారికే మోక్షలక్ష్మి సంప్రాప్తించును. 'ఎపుడు నేను బంధము నుండి విడి వడుదునా, ఎపుడు జనన మరణ రహిత మగు శాశ్వతపదవి నాకు సంప్రాప్తిం చునా'యని తీవ్ర ఆవేదనతో పరి తపించువానికి ముక్తి దరిదాపుననే యుండును. భగవంతుని దర్శనము కాలేదేయని రాత్రింబగళ్లు విలపించుచు కన్నీరు ధారధారగా ప్రవహింపజేసి దైవాయ చిత్తులై మెలగు మహనీయు లెందఱినో గూర్చి మనము చరిత్రల యందు వినియున్నాము కదా! వారే మోక్షపరాయణులు అట్టివారు ముక్తి సాధనములను అతిశ్రద్ధాభక్తులతో ఆచరించుదురు.

విగతేచ్ఛాభయక్రోధః – కామాది దుర్వాసనా రాహిత్యమును గూర్చి భగవానుడు. ఎన్నియోసారులు హెచ్చరించియుండెను. వాని నిర్మూలనము హృదయశుద్ధికి ఆత్మ జ్ఞానోదయమునకు అత్యావశ్యకము గనుక పదేపదే వానిని గూర్చి చెప్పుటకు కారణమైనది. కామము, క్రోధము, భయము ఈ మూడు దుర్గుణములు హృదయమును వదలిపోయినచో. హృదయము నిర్మలమై భాసించును నిర్మలహృదయముననే జ్ఞాన భాస్కరుడు ఉదయించును.

మునిః – మననశీలుడైయుండు వాడు.

"సదాముక్తః" – అని చెప్పుట వలన పైన తెలిపిన సద్గుణములచే విరాజితుడగువాడు, ఎల్లప్పుడును ముక్తుడే అయియుండునని భావము. మోక్షమునకై మరియొక లోకమునకు పోనవసరములేదు. మరియొక దేహమును ధరింపనవసరము లేదు. ఎప్పుడో కలుగునని దిగులును పొందనక్కరలేదు. ఈ సాధనలందు ఆరితేరిన మరుక్షణమే మనుజుడు ముక్తుడై చెన్నొందునని భగవానుడిచ్చుట అభయమొసంగెను.

**(సశేషము)**

*(గీతామకరంద రచయిత శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామివారి నిత్యస్మరణీయ గీతావాక్యములు కొన్ని యథాతథంగా.)*

# అట్లాంటియనుల జీవనము విస్తరణ - నశించుట

- శ్రీమతి యం.రాజసరస్వతి, గుంటూరు
సెల్ : 9490541800

అట్లాంటియనులు పెద్దబొమ్మలు, 27 అడుగుల ఎత్తున, చేసి వారి రూపులను వారే ఆరాధించేవారు. అట్లాంటియనులను నీరు భయపెట్టింది. వారి పితరులైన లెమూరియనులను అగ్ని భయపెట్టింది.

ఈస్టర్ ద్వీపంలో పెద్ద పెద్ద బొమ్మలు కనిపించాయి. అలాంటి బొమ్మలే గోబి ఎడారిలో ఎక్కువ నీట మునిగిన చోట కన్పించాయి. "కుక్" కనుగొన్నవి 27 అడుగులు ఎత్తు, 8 అడుగులు భుజాల మధ్య కొలత కలిగినవి ఈస్టర్ ద్వీపంలో వున్నాయి. బరువు తక్కువగా వున్నాయని సైన్సు నిర్ణయించింది.

అగ్నుల వలన లెమూరియా నశించిన తర్వాత, మానవ ఎత్తు తగ్గింది. మిలియను సంవత్సరాల తర్వాత 6 లేక 7 అడుగులకు వచ్చింది. ఆసియా జాతి 5, 6 అడుగులు.

4వ జాతి జీవుల్లో మంచి వైవిధ్యము కన్పిస్తుంది. పాలినేషియా ప్రజలు మంచి ఎత్తు. ఇండియా, ఇండొనేషియా మధ్యస్థపు ఎత్తు. పాలినేషియా పూర్వీకులుగా చెప్ప వచ్చు. టాస్మేనియనులు క్షీణదశ. ఆస్ట్రేలియనులకు చాలా వరకు పూర్వీక జాతి లేరు. పూర్వీకులందరూ పోయినట్లే.

ఇండియనులకు రాశిచక్రము గురించిన జ్ఞానము మొదటలేదని, గ్రీకుల వల్లనే ఏర్పడిందని అంచనా.

లెమూరియా మునగటం "Norway"లో మొదలై "శ్రీలంక"లో అంతమైంది. లంక అట్లాంటియనుల వశమైంది. పురాతన లంక అవశేషమే ఇప్పటి "Ceylon" ప్రాంతము. అది పురాతన లంక ఉత్తర భాగము. లెమూరియా ఉత్తరభాగము ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంలో వుంది. లెమూరియా మూడవ జాతి ఊయల పసిఫిక్ సముద్రము. పసిఫిక్, హిందూ మహాసముద్రాలలో గుర్రపునాడా ఆకృతిలో, పాతమెడగాస్కర్, ఇప్పటి S.Africa చుట్టూ అట్లాంటిక్ మహా సముద్రంలో Norway వరకు వుంది. దీని మీద ఒక గట్టువంటిది అట్లాంటిక్ సముద్రంలో 9000 అ. ఎత్తున 2, 3

వేల మైళ్ళు దక్షిణంగా బ్రిటిష్ ద్వీపాలున్న చోట, S.America వైపు వంగి, Africa వరకు వ్యాపించి వుంది. ఈ గట్టు అట్లాంటిక్ ఖండ అవశేషము. ఇది హిందూ మహాసముద్రం దాకా వ్యాపించి వుంది.

4వ జాతి అట్లాంటియనులు లెమూరియా మూడవజాతి కేంద్రక భాగాల నుంచి ఏర్పడినవారే. అనేక ద్వీపాలు, పెనిన్సులాలు, మార్పులు చెంది, అట్లాంటియనులకు నిలయాలుగా మారాయి.

ఈజిప్టువారు మొదట్నుంచి బాగా పరిణామము చెందివున్నారు. మహోన్నత భవన కట్టడాలు, మెంఫిస్ పాలస్ కట్టినవైనము, డాక్టర్ ప్రవృత్తులు, అనేక గ్రంథాలు అన్నింటిలో ఈజిప్టు ముందంజ వేసింది.

హెరోడోటస్ లెక్కల ప్రకారము ఈజిప్టు పూజారులు 12,000 సం॥రాల క్రితమే వున్నారు. అయినా అభివృద్ధిలో సాంఘిక, రాజకీయ జీవితాలలో లెమూరియనులదే పైచేయి.

అక్టల్ట్ సిద్ధాంతాలను మనము 7 సైన్సుల ద్వారా తెల్సుకుంటాము.

1) సత్యము గురించిన ఆలోచన,

2) ఆదర్శము,

3) శుద్ధదివ్యత్వము, ఆధ్యాత్మికత.

పురాతన గ్రంథాలలో, పురాణాలలో వున్నట్లుగా కథలు లేవు. వాటిని ఈ క్రింది విధానాల ద్వారా తెల్సుకోవాల్సిందే.

**1. సింబాలికల్ :** చిహ్నాల రూపంలో పురాతన ఆలోచనా విధానము మలచబడింది.

**2. ఎంబ్లమాటికల్ :** చైనా ఎంబ్లమ్‌లు, అక్షరమక్షరము, గ్రాంధిక శైలి గ్రామర్‌తో వుంది. ఇది చాలా కష్ట సాధ్యము.

**3. పారబాలికల్ :** కథలు, పురాణములవలె వుంటాయి.

**4. హైరో గ్లిఫికల్ :** చైనా అక్షర కణముల వలెనే ప్రతిదీ వుంటుంది.

వేదాలు, Book of Dead, బైబిల్‌లు, లోగో గ్రాములు గల్గి వీటిని రూపాంతరము చెందిస్తే తప్ప విజ్ఞానము మనం వశపర్చుకోలేము. మనం చర్చించుకున్న అన్ని విషయాలు ఆ గ్రంథాలలో కార్యకారణ సంబంధాలతో వర్ణించబడినాయి. Jack and Jill కథలు, దైవ దానవ సంగ్రామాలు, ప్రతి దేశంలోనూ వేరు పేర్ల రూపంలో వున్నాయి.

# అంటువ్యాధులు, మహమ్మారులు దివ్యజ్ఞాన సమాజపు దృక్పథం

**శ్రీ కె.వి.ఎల్.కాంతారావు,**
హైదరాబాద్.

ప్రస్తుతం COVID-19 లేదా కరోనా వైరస్ వల్ల అసంఖ్యాకమైన మరణాలు, తీవ్రమైన అనారోగ్యంతో మానవాళి అంతా కొంత భయంతో, ఆదుర్దాతో, నిస్సహాయంగా దానిని ఎదుర్కొనే మందులు కోసం / వ్యాక్సిన్ కోసం ఎదురుచూస్తోందని మనకు తెలుసు. ప్రభుత్వాల ఆదేశాలు, సలహాల మేరకు మన జీవనశైలిని తగిన విధంగా మార్చుకుంటున్నాం. ఉదాహరణకు మొహానికి మాస్క్ కట్టుకోవడం, చేతులను తరచుగా శుభ్రం చేసుకోవడం, సామాజిక దూరం పాటించడం, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం మొదలైన పనులన్నీ చేస్తున్నాం. భౌతిక అలవాట్లలో ఇటువంటి మార్పులు తీసుకురావడమే కాకుండా, మానసిక దృఢత్వాన్ని పెంచుకోడానికి, ఎటువంటి పరిస్థితినైనా ఆధ్యాత్మిక జ్ఞానంతో మన సమతా స్థితిని పోకుండా ప్రయత్నిస్తున్నాం. ఉదాహరణకు భగవత్ తత్వం పై ధ్యానం చేస్తూ, పూజలు, అర్చనలు మొదలైన ధార్మిక కార్యాలను ఇంటి వద్ద నుండే నిర్వర్తిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సత్సాంగత్యం కొనసాగిస్తున్నాం.

దీనిలో భాగంగా, ఇటువంటి అసాధారణ పరిస్థితులు ఏర్పడినప్పుడు మన జీవన విధానం, దృక్పథం ఏ విధంగా ఉండాలో, దివ్యజ్ఞాన సమాజ స్థాపకులు H.P.Blavatsky గారు, W.Q.Judge గారు ఆ రోజుల్లో వివరించిన విషయాలను మీ ముందు ఉంచుతున్నాను.

ప్రపంచంలో ఎటువంటి పరిణామం ఎదురైనా, దానిని పూర్తిగా అవగాహన చేసుకోవాలంటే, తదనుగుణంగా ఏ విధంగా ప్రవర్తించాలంటే, దివ్యజ్ఞానం మనకు ప్రసాదించిన మూడు ప్రాథమిక ప్రతిపాదనల నేపథ్యంలో దానిని చూడటం చాలా ముఖ్యం. H.P.Blavatsky గారు వ్రాసిన రహస్య గ్రంథంలో (Secret Doctrine) తెలిపిన ఈ మూడింటిని యధాతథంగాను, సంక్షిప్తంగాను ఒకసారి పరిశీలిద్దాం .

**1. Boundlessness – హద్దులు / పరిమితులు లేనిది తత్వము**

సర్వవ్యాపితము, నిత్యత్వము, బంధానాతీతము, పరివర్తనాతీతమైన (మార్పులేని) ప్రాథమిక సూత్రాన్ని తత్వాన్ని ఊహించుట కూడా అసాధ్యము. ఇది మానవ భావనా శక్తిని మించి పోయింది. దీనిని మానవులు వ్యక్తము చేయుటకు లేదా ఉపమానములతో వివరించుటకు చేసెడి ప్రయత్నములన్నీ అసలు విషయాన్ని మరుగునపరుస్తాయి. ఇది ఊహకు అందని పరిధిలోనిది, చేరుకోలేనిది – మాండూక్య ఉపనిషత్తులో దీనిని 'ఊహాతీతమైనది', 'చెప్పనలవి కానిది' అని వర్ణించారు.

**2. Cyclicity – విశ్వాంతరాళ జీవన చక్రం**

నిత్యమైన విశ్వం మొత్తం పరిధులు లేని ఒక మహాక్షేత్రం; ఈ క్షేత్రం అనంత కోటి విశ్వాలు నిరంతరము ఆవర్తనంగా సృష్టింపబడుతూ అంతర్ధానమొందుతున్న ఒక ఆటస్థలానికి వేదికలాంటిది. వీటిని అభి వ్యక్తీకరణం చెందిన తారలు, నిత్యత్వమైన 'విస్ఫులింగాలు' అంటారు. (ధ్యానశ్లోకాలలో చెప్పినట్లు) నిరంతర యాత్రికుని నిత్యత్వం స్వయంభూ జీవనములోని రెప్పపాటు కాలంలా ఉంటుంది. ప్రపంచాల ప్రత్యక్షము, అంతర్ధానము సముద్రంలో క్రమాను సారంగా ఉన్న కెరటాల ఆటుపోట్లు వలె ఉన్నాయి.

**3. Fundamental identity of life; As above, so below – ప్రాథమిక గుర్తింపు, ఊర్ధ్వ జీవనం మాదిరిగానే ఆధోజీవనం కూడా ఉంటుంది**

పరమపద విశ్వాత్మతో ఇతర ఆత్మలన్నీ ప్రాథమిక గుర్తింపును కలిగి ఉంటాయి; పరమపద విశ్వాత్మ కూడా తెలిసికోలేని మూలాలకు సంబం ధించినదే; విశ్వాత్మలో ఒక విస్ఫులింగ మైన ప్రతి ఆత్మ, తన మొత్తం జీవన కాలంలో జన్మల (పునర్జన్మ సిద్ధాంతము – అవసర న్యాయము) పరంపరను జీవిత చక్రభ్రమణ, కర్మ సూత్రాల ననుసరించి పరమపద విశ్వాత్మకు చేరుటకు విధిగా యాత్ర చేయవలె.

ఈ మూడు ప్రతిపాదనలను గమనిస్తే, ప్రతిదీ ఎలా పరస్పరం అను సంధానించబడిందో, విశ్వ ప్రభావాలు మనపై ఎలా ప్రభావం చూపుతాయో తెలుస్తుంది, కొన్నిసార్లు అంటువ్యాధులు ఎలా ఏర్పడతాయో కూడా బోధపడు తుంది. ఇదంతా కర్మ ప్రభావం వలన ఎల్లప్పుడూ జరుగుతుందని, మన మనస్తత్వానికి వేరు కాదని ఇది వివరిస్తుంది.

From H.P. Blavatsky's - 'Stars and Numbers' (తారలు, సంఖ్యలు) – Collected Writings - Vol:3, P:192-201:

ప్రాచీన నాగరికతలకు జ్యోతిష శాస్త్రంలో అసంబద్ధమైనవి ఏవీ ఉన్నాయని అనిపించలేదు, ఈ రోజుల్లో కూడా చాలామంది విద్యావంతులు, నిజమైన శాస్త్రజ్ఞులు దీనిలో అసంబద్ధ మైనవి చూసిన వారు లేరు. మనుషుల, దేశాల విధి వ్రాతను, కార్యకలాపాలను ముందుగానే ఊహించగల న్యాయ బద్ధమైన ఖగోళ శాస్త్రం (Judicial Astrology - men and nations) ఇదివరకు ఉన్నా, ఇప్పుడు లేకున్నా – స్వార్థ చింతన లేని శాస్త్రమని దీని భావం) ప్రస్తుత సహజ జ్యోతిషశాస్త్రం (Natural Astrology - weather) లేదా ఖగోళ శాస్త్రం (Astronomy) కంటే ఏమాత్రం తీసిపోదు ఎందుకంటే ఈ న్యాయ బద్ధమైన ఖగోళ శాస్త్రం తత్వానికి, శాస్త్రానికి వ్యతిరేకం కాదు అయితే ఖగోళ శాస్త్ర సహాయంతో వాతావరణ మార్పులే కాకుండా భూకంపాలు, తుఫానులు మొదలైన క్రూరమైన, ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే ఊహించ వచ్చు.

ఎందుకంటే, ఆ సంక్లిష్టమైన, నిజంగా గొప్పదైన ఆ విజ్ఞాన శాస్త్రాన్ని, భక్తులు ఎప్పుడూ దివ్య ప్రవచనం వలన కొనసాగుతోందని భావించలేదు, కానీ జ్యోతిష్కుడు అనుసరించే పద్ధతిలో అతడికి ఉన్న నైపుణ్యం వల్ల మనిషి జన్మించిన సమయంలో గ్రహాల స్థానంపై ఆధారపడి ఆ వ్యక్తి జీవితం లోని కొన్ని సంఘటనలను ముందుగానే ఊహించ గలుగుతాడు.

మనిషి యొక్క విధివ్రాతపై నక్షత్రాల గుప్తమైన ప్రభావం సంభవించవచ్చుని, లేక అటువంటి అవకాశం సాధారణంగా ఉంటుందని అంగీకరిస్తే, సూర్యుడు లో మచ్చలు బంగాళదుంప పై పడే ప్రభావం కంటే, నక్షత్రాలు – మనుషుల విషయంలో మాత్రం ఎందుకు ఎక్కువ అసంభవంగా కనిపిస్తుంది? జ్యోతిష శాస్త్రం, ఖగోళ శాస్త్రం కంటే తక్కువ ఖచ్చితమైన శాస్త్రం ఏమి కాదు. Prof. Balfour Stewart, F.R.S. ఈ విషయం చెప్పాడు: సూర్యుడిపై ఏం జరిగినా భూమి చాలా తీవ్రంగా ప్రభావితమవుతుంది సూర్యుడిపై జరుగుతున్న దానికి, అంటువ్యాధులకు మధ్య ఏదో సంబంధం ఉంటుందని గట్టిగా అనుమానించవచ్చు.

ఒకవేళ, ఆ విజ్ఞాన శాస్త్రవేత్త మనకు చెప్పినట్లుగా, "సూర్యుడికి, భూమికి మధ్య

అంతుపట్టని సంబంధం ఉందని ఖచ్చితంగా అనుమానిస్తే.... అది పరిష్కరించవలసిన అత్యంత ముఖ్యమైన సమస్యే"; అటువంటి వేరొక అంతుపట్టని సమస్యకి పరిష్కారం ఇంకా ఎంత ముఖ్యమైనదో – ఆ సమస్య: మనిషికి, నక్షత్రాలకి మధ్య ఉన్న నిస్సందేహమైన అనుబంధం; మనుష్యులలో అత్యంత విద్యావంతులు కూడా యుగాల తరబడి విశ్వసిస్తున్న ఈ అనుబంధం. ఒక ఎర్ర ముల్లంగి (turnip) లేక ఒక బంగాళా దుంప విషయంలో ఏవిధంగా ఉందో, అదేవిధంగా ఖచ్చితంగా మనిషి విధి విషయం కూడా పరిగణింపబడాలి.

సూర్యుడిలో మచ్చలు ఏర్పడిన సమయంలో, ఎర్ర ముల్లంగిలో దిగుబడి ఉండదని శాస్త్రీయంగా ముందే చెప్ప గలిగితే, "ఒక వ్యాధిని, అనారోగ్యాన్ని, సహజమైన లేక హింసాత్మకమైన మరణం గురించి ముందుగానే ఎందుకు సూచించ లేము? సూర్యుడి ప్రభావం భూమిపై పడుతున్నట్టే, నక్షత్ర మండలం మానవుడితో నేరుగా అనుసంధాన మైనప్పటికీ అతని విషయంలో శాస్త్రీయంగా ముందే ఎందుకు చెప్పలేము?

ప్రస్తుతం మన కాలంలో ఖగోళ పరమైన అంచనాల మాదిరిగానే, ఆ రోజుల్లో జ్యోతిషశాస్త్రం ఎంతో గౌరవించ బడింది, అప్పుడు కూడా అనుభవజ్ఞులైన జ్యోతిష శాస్త్రజ్ఞుల వలన ఖచ్చితమైన, విశ్వసనీయమైన అంచనాలు ఉండేవి. ఇప్పుడు భారతదేశంలో ఉన్నదానికంటే ఎక్కువ కాకపోయినా, ఆ రోజుల్లో రోమ్ సామ్రాజ్యాలలో కూడా శకునాల గురించి అధ్యయనం జరిగేది.

గొప్ప ఖగోళ శాస్త్రవేత్త కెప్లర్ 'జ్యోతిష్య శాస్త్రాన్ని నిజమైన శాస్త్రంగా' అతడు విశ్వసించి, ప్రపంచానికి ప్రకటించాడు. అతడు కనుగొన్న మూడు గొప్ప సూత్రాలను గ్రహాల చలనానికి సంబంధించిన 'కెప్లర్ సూత్రాలు' అంటారు.

**కెప్లర్ సూత్రాలు:**

1. సూర్యుడు చుట్టూ గ్రహాలు దీర్ఘవృత్తాకార మార్గంలో పరిభ్రమిస్తుంటాయి, సూర్యుడు దీర్ఘ వృత్తం యొక్క ఒక నాభి వద్ద ఉంటాడు.

2. సూర్యుడు నుండి గ్రహానికి కలపబడిన సరళ రేఖ సమాన కాలాలలో సమాన వైశాల్యాలను ఏర్పరుస్తుంది.

3. సూర్యుడు నుండి గ్రహానికి ఉన్న సరాసరి దూర ఘనము, సూర్యుడు చుట్టూ ఆ గ్రహము చేసే భ్రమణ కాల వర్గానికి అనులోమానుపాతంగా ఉంటుంది.

$R^3$ proportional to $T^2$; $R^3/T^2=K$ (K=Constant).

ఈ సూత్రాలకు అనుగుణంగానే గ్రహాలు సూర్యుని చుట్టూ దీర్ఘవృత్తాకార పరిధిలో భ్రమణం చేస్తున్నప్పుడు ఒక్కోసారి సూర్యుడికి అతి దగ్గరగాను, మరోసారి చాలా దూరంగాను ఉంటాయని తెలుస్తోంది. తరువాతి కాలంలో కనుగొన్న ఒక ముఖ్యమైన విషయం: కుజ గ్రహం సూర్యుడికి ఎప్పుడు దగ్గరగా వచ్చినా సూర్యుడిపై మచ్చలు కనిపించేవట. ఆ మచ్చల ప్రభావం వృక్ష వర్గం పైన, మనుష్య వర్గం పైన ప్రభావం చూపుతోందని ఇంతకు ముందే చర్చించుకున్నాం. (జంతు వర్గం గురించి ప్రస్తుతం ఆ ప్రస్తావన లేదు).

From H.P. Blavatsky's - Collected writings: Vol - IX, P: 103

ఈ యుగంలో విజ్ఞానశాస్త్రం యొక్క గొప్ప విజయాలే ఉన్నాయి, కానీ అవన్నీ కార్యాల వైపు దృష్టి పెట్టినవే కానీ, చెడుకు మూలమైన కారణాలను తొలగించేవిగా లేవు. వ్యాధుల నివారణలో గొప్ప పురోగతులు జరిగాయి, కానీ భవిష్యత్తులో, మన నాగరికత వికసించినపుడు (!), కొత్త వ్యాధులు తలెత్తుతాయి, మరింత వింత రుగ్మతలు బయట పడతాయి; ఈ రుగ్మతలన్నీ మనుషుల మనసులలో లోతుగా పాతుకు పోయిన కారణాల వల్లనే (స్వార్థం, అసూయ, పోటీతత్వం, అహంభావం మొ..) బయట పడతాయి, అవన్నీ ఆధ్యాత్మిక జీవనం ద్వారా మాత్రమే నిర్మూలించ బడతాయి.

From H.P. Blavatsky's - Collected writings - Vol: XII, P: 403:

జర్మన్ తత్వవేత్త Paracelsus ప్రకటించిన విషయం: ఊహా లోకాన్ని విశ్వాసం ధ్రువీకరించాలి, ఎందుకంటే విశ్వాసం ఇచ్ఛని / నిశ్చయాన్ని దృఢ పరుస్తుంది. అద్భుతమైన కార్య కలాపాలన్నీ కృతనిశ్చయంతోనే ప్రారంభం అవుతాయి. సగం, కాకపోతే మూడింట రెండు వంతుల అనారోగ్యాలు, వ్యాధులు మన ఊహలు, భయాల ఫలితమే. భయాన్ని నాశనం చేసి, ఊహలకి తలవంచండి, మిగిలిన దంతా ప్రకృతి చూసుకుంటుంది.

**(సశేషము)**

***(8-6-2020న గోదావరి దివ్య జ్ఞాన సమాజం, ధవళేశ్వరంవారు నిర్వహించిన అంతర్జాల సమావేశములో చేసిన ప్రసంగం.)***

# దివ్యజ్ఞానము - మతసామరస్యము

- **శ్రీమతి జె.సత్యవతి,** బెంగుళూరు,

సెల్ : 805032823.

మనిషి మనుగడ సరిగా ఉండాలంటే, మంచి సమాజం, మంచి ఆలోచనలు, మంచి జీవన విధానం ఉంటేనే ప్రశాంతత వెల్లివిరుస్తుంది. ఈ విధానాలు మన పెద్దలు, గురువులు, ఆధ్యాత్మిక గ్రంధాలు, ఇలామనకి చాలా రకాలుగా అందుబాటులో ఉన్నాయి. వాటి మీద మనకి లక్ష్యం ఉండాలి, శ్రద్ధ వుండాలి. అప్పుడే మనధర్మం మనం పాటిస్తాము. ధర్మబద్ధమైన జీవనమే "సత్యాన్నాస్తి పరోధర్మంః". దివ్యజ్ఞాన సమాజ ఎంబ్లమ్ మీద ఇదే ముఖ్యంగా కనబడుతుంది. అందుకే మత గ్రంధాలు చదవమని పెద్దలు చెపుతారు. రామాయణం, భాగవతం, ఖురాన్, భగవద్గీత, బైబుల్ ఇలా అన్నిమత గ్రంధాలలోనూ మంచి నీతి, ధర్మం సత్యం బోధించబడ్డాయి. బాహ్యంగా మనకి కనిపించే ఆచారాలు తేడాగా కనిపించవచ్చు. అంతర్గతమైన అర్థం ఒకే సత్యాన్ని బోధిస్తున్నాయి. పైపై విషయాలకు ప్రాధాన్యం ఇవ్వటం మానాలి.

ఉదా – దక్షిణాది ప్రాంతం వారు పంచ కట్టుకుని పూజ చేస్తారు. ఉత్తరాదిన స్వెట్టరు, కోటు వేసుకుని వారివారి ప్రార్ధనలు చేస్తారు. అది ప్రాంతాన్ని బట్టి చేస్తున్న మార్పు మాత్రమే. వారి ప్రధాన ఉద్దేశం భగవంతుడి పూజ ముఖ్యం. ఎవరి మతం వారు జన్మతహ వచ్చిన మతాన్ని భక్తిశ్రద్ధలతో పాటించి, ఇతర మతములను గౌరవించమని చెపుతుంది దివ్యజ్ఞానం అందుకే ఈ సమాజంలో అన్ని మతములవారు సభ్యులుగా ఉంటారు. అంతర్జాతీయ దివ్యజ్ఞాన సమాజం చెన్నైలోని అడయారులో అన్ని ముఖ్యమైన మతముల దేవాలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. కుతూహలం ఉన్నవారు దర్శించవచ్చు. మరి అన్ని మతములలోని సత్యం ఒక్కటని ఎలా తెలుసుకోవటం ? సందేహం కలుగవచ్చు. దివ్యజ్ఞాన సమాజంవారి Seven Great Religions అను గ్రంధం (డా॥ బెసెంటు అమ్మగారు రచించారు) చదివి తెలుసుకుంటే మతములలోని సామరస్యం

తెలుస్తుంది. హిందూ, జురాస్ట్రియన్, జైను, బుద్ధిజమ్, క్రిష్టియన్, ఇస్లాం, సిక్కు మతాల గురించి ఒకే గ్రంథంలో పొందుపరిచారు. అన్నింటి మూల తత్వం ఒకటే. ఒకరు ప్రేమ అంటారు, ఒకరు ధర్మం, ఒకరు అహింస, ఒకరు సత్యం, పేర్లు తేడాగా కనిపించినా అందరిలో సామరస్యం, అభేధభావం ముఖ్యమని దివ్యజ్ఞానం బోధిస్తుంది. ఎవరినీ కించ పరచవద్దు. అందరిలోని మానవతాదృష్టి, మానవునిలో మహనీయతను తెలిపేది దివ్యజ్ఞానం. విశ్వకళ్యాణానికి, విశ్వసౌభాగ్యానికి ఇటువంటి బోధనలు, శాంతిని చేకూరుస్తాయి. ఇటువంటి సమాజం ప్రస్తుత పరిస్థితులలో చాలా అవసరం. ఈ అవగాహన మానవుడిని అభివృద్ధి పథంలో నడుపుతుంది, ఆనందాన్నిస్తుంది.

- - -

## ముఖ్య గమనిక :

దివ్యజ్ఞానదీపిక పాఠకులకు, రచయితలకు, సమాజ కార్యదర్శులకు ముఖ్య గమనిక. 12 సెప్టెంబరు, 2020వ తేదీన జరిగిన కార్యవర్గసమావేశములో డా॥ ఈ.వి.కె. శివానంద్ గారు నూతన సంపాదకునిగా ఎన్నుకోబడ్డారు. కావున ఇకపై మీ వ్యాసాలను, వార్తలు, ఫోటోలను ఈ క్రింద ఇవ్వబడిన చిరునామాకు పంపగలరు.



**డా॥ ఈ.వి.కె. శివానంద్ గారు**

Ph.D., (Journalism)

M.B.A., M.A.,(Astrology)
డి.నెం. 49-36-33,
అక్కయ్యపాలెం,
విశాఖపట్టణం-530 016
Ph : 9393260565
Email : e.v.k.sivanand@gmail.com

# కనువిప్పు

## శ్రీ రామకృష్ణ పరమహంస గారు చెప్పిన ఒక చిన్న సంఘటన..

కాళీమాత ఆలయంలో ఓరోజు ప్రసాదంగా ఇవ్వడానికి లడ్డూ తయారు చేస్తున్నారు. అయితే ఎక్కడి నుంచి వచ్చాయో తెలీదు లడ్డూకి చీమలు పట్టడం మొదలైంది. లడ్డూ తయారు చేస్తున్న వారికి ఏం చేయాలో తెలీలేదు.

"చీమలను చంపకుండా ఎలా?" అని ఆలోచనలో పడ్డారు. వాటిని చంపకుండా ఉండడానికి ఏం చేయాలో చెప్పమని రామకృష్ణ పరమహంసను సలహా అడిగారు. అప్పుడాయన చీమలు వస్తున్న దారిలో చక్కెర పొడి చల్లండి. వాటిని తీసుకుని చీమలు వెళ్ళిపోతాయి, ఇక ఇటు రావు అని సూచించారు.

పరమహంస చెప్పినట్లే చీమలొచ్చే దారిలో చక్కెర పొడి చల్లారు. ఆ పొడిని చూడటంతోనే వాటిని నోట కరుచుకుని చీమలు కాస్సేపటికల్లా అక్కడి నుంచి వెళ్ళిపోవడం మొదలుపెట్టాయి....సమస్య కొలిక్కి వచ్చింది....

ఈ దృశ్యాన్ని చూసిన పరమహంస గారు ఇలా అన్నారు... "మనుషులూ ఈ చీమల్లాంటివారే. తాము కోరుకున్న వాటిని పొందాలనుకుంటూనే తమకు తెలియకుండానే దానిని మధ్యలోనే విడిచిపెట్టి మరొకటేదైనా దారిలో కనిపిస్తే దానితో సరిపెట్టుకుంటారు తప్ప ముందనుకున్న లక్ష్యాన్ని విడిచిపెడతారు...." అని చెప్పారు.


తమకు కావలసింది చక్కెర కాదు లడ్డూ పొడేనని ఒక్క చీమా ముందుకు రాలేదు.... మనం కూడా అలానే భగవంతుడు సర్వస్వమ్ అనుకొనే సాధన మొదలు పెడతాము, మధ్యలో ఎవరో ఎదో చెపితే దాని వద్దకు వెళ్లి మన సాధన అంత వృధా చేసుకొంటాము..

తీయగా ఉందన్న చక్కెరతో సరిపెట్టుకుని వెళ్ళిపోయాయి చీమలు. రవ్వంత చక్కెర సంతోషం చాలనుకున్నాయవి. లడ్డూ అంత పరిపూర్ణమైన సంతోషం పొందాలనుకునే వారు చాలా తక్కువ మందే అని పరమహంస చెప్పారు....

ఇప్పుడు ఆలోచించండి. లడ్డును (మోక్షమును) చేరుకుందామా? లేకపోతే,
చీమల మాదిరిగా (భౌతిక సుఖాలకే పరిమితం అవుతూ) జీవిద్దామా!
నరజన్మను వృథా చేసుకుందామా!

# వార్తలు - విశేషాలు

**గుంటూరు :**



శ్రీకృష్ణదివ్యజ్ఞాన సమాజం, గుంటూరు వారు అంతర్జాలము ద్వారా "ద డివైన్ ప్లాన్" అను గ్రంథాన్ని సెప్టెంబరు 6, 13వ తేదీలలో ఉ॥11.30ని॥ అధ్యయనం చేసారు. ఈ అధ్యయనాన్ని శ్రీ జి.వీర రాఘవరావుగారు నిర్వహిస్తున్నారు. సుమారు 30 మంది దివ్యజ్ఞాన సమాజముల సభ్యులు పాల్గొన్నారని సమాజ కార్యదర్శి దీపికకు తెలియజేశారు.

**ధవళేశ్వరం :**

గోదావరి దివ్యజ్ఞాన సమాజం, ధవళేశ్వరం వారు ప్రపంచంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజల యొక్క ఆరోగ్యం కొరకు, వాతావరణ శుద్ధి ద్వారా ప్రజలలో వ్యాధినిరోధక శక్తిని పెంపొందించేందుకు 'మహాదివ్యయజ్ఞము'ను నిర్వహించారు. ది.19.8.2020 నుండి 2.9.2020 వరకు 15 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలుగు ఫెడరేషన్, రాజమండ్రి దివ్యజ్ఞాన సమాజము మరియు గోదావరీ దివ్యజ్ఞాన సమాజము వారు సంయుక్తంగా నిర్వహించి 2.9.2020వ తేదీన పూర్ణాహుతితో ముగించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన రాజమండ్రి దివ్యజ్ఞాన సమాజ అధ్యక్షురాలైన శ్రీమతి జెట్టి లక్ష్మీరాణిగారిని ది.6.9.2020న తేదీన ధవళేశ్వరం దివ్యజ్ఞాన సమాజములో సన్మానించినారని కార్యదర్శి ఉడతారంగారావుగారు దీపికకు తెలియజేశారు.

